రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## కేంద్ర మంత్రి రామదాస్‌ను కలిసిన శ్రీవర్ధన్ రెడ్డి



**షాద్‌నగర్, ఆగస్టు 14, (ప్రభాతవార్త) :** కేంద్ర సామాజిక న్యాయ మరియు సాధికారత శాఖ సహాయ మంత్రి రామదాస్ అథవాలేని షాద్‌నగర్ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో బుధవారం బీజేపీ పార్లమెంటు సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, సీనియర్ నాయకులు సైదిరెడ్డితో పాటు కలిసి కేంద్ర మంత్రిని సన్మానించినట్లు తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, ఊచకోతలపై చర్చించినట్లు తెలిపారు. గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన సమయంలో కూడా వారితో తనకు పరిచయాలు ఉన్నట్లు శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా తాజా రాజకీయాలపై మంత్రితో చర్చించినట్లు శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపారు.

## గిరిపుత్రులకు ఆంజనేయుడి అభయం

### ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి



**షాద్‌నగర్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** ప్రజలపై ఆంజనేయస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. షాద్‌నగర్ పరిధిలోని దొంతి కుంట తండాలో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులు వారిని సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆంజనేయ స్వామిని గిరిజనులు తండాల్లో ఎంతో గొప్పగా కొలుస్తారని పేర్కొన్నారు. గిరిజనులకు స్వామివారి అండాదండా ఎల్లవేళలా ఉంటాయని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ భవనంను ప్రారంభిస్తున్న కలెక్టర్‌ప్రతీక్‌జైన్

## గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి : కలెక్టర్

**బొంరాస్‌పేట్, ఆగస్టు14, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, తాలుక కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి తిరుపతిరెడ్డితో కలిసి బొంరాస్‌పేట్ మండలం నాందార్‌పూర్, లింగన్‌పల్లిలో నూతన గ్రామాపంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో మౌళిక సదుపాయాల కల్పనకోసం రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. గ్రామపంచాయతీలపై ప్రత్యేకంగా దృష్టిసారించి నూతన భవనాల నిర్మాణం కోసం 20లక్షల రూపాయల అంచనా వ్యయంతో పంచాయతీ భవనాలు నిర్మాణం చేసి ప్రారంభిచుకున్నామని అన్నారు. గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాలు పట్టుకొమ్మలని గ్రామప్రజలకు ఎటువంటి సమస్యలు ఎదురైన గ్రామపంచాయతీ భవనాలలో పరిష్కరించుకోవచ్చని గ్రామప్రజలు పంచాయతీ భవనాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వెంకన్నగౌడ్, ఎంపిఓ మహేష్‌కుమార్, మండల అధ్యక్షులు నర్సిములుగౌడ్, పిఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్‌రాములుగౌడ్, మల్లికార్జున్, రాంరెడ్డి, అంజిల్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, దేశ్యనాయక్, రమేష్ గౌడ్, రవిగౌడ్, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు

### అందించనున్న స్పీకర్, కలెక్టర్

**బొంరాస్‌పేట్, ఆగస్టు14, ప్రభాతవార్త :** నేడు ఆగస్టు 15న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా విద్యాధికారి రేణుకదేవి చేతుల మీదుగా దుద్యాల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు అందించనున్నారు. దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి అస్మిత, 9వ తరగతి చదువుతున్న సంగీత వికారాబాద్ జిల్లా స్థాయిలో స్వాతంత్రోద్యమంలో జాతీయనాయకుల పాత్ర ఉపన్యాసం, జాతీయ నాయకుల చిత్రపటాల చిత్రలేఖనంలో దుద్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించడం జరిగిందని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు విజయరామరావు, ఉపాధ్యాయులు టీవివి నాయకులు రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, ముకుందరెడ్డి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.ర్

## బావమరిదిపై బావ కత్తితో దాడి

**పూడూరు, ఆగస్టు 14, ప్రభాతవార్త :** భార్యా భర్తల తగాదాలో బావమర్ధిపై బావ చాకుతో దాడి చేసిన సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పరిధిలోని కడ్మూరు గ్రామంలో చోటుచేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి, స్థానికుల కథనం ప్రకారం పూడూరు మండలం పరిధిలోని కడ్మూరు గ్రామానికి చెందిన జొన్నాడ జంగయ్య (35), కు రంగారెడ్డిజిల్లా షాబాద్ మండలం నాన్‌దార్ఖాన్‌పేట్‌కు చెందిన స్వప్నతో గతకొన్నేళ్ల క్రింద వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు. అయితే మంగళవారం రాత్రి వీరిమధ్య తగాదా జరుగడంతో జంగయ్య తన అత్త(స్వప్నతల్లి)కి, బావమరిది బింగి నరేందర్‌కు ఫోన్‌చేసి దుర్భాషలు ఆడగా, అడిగేందుకు కడ్మూరు గ్రామనికి మరికొందరితో కలిసి సుమారు రాత్రి 10గంటల ప్రాంతంలో వచ్చాడు. దీంతో బావా బావమరిదిల మధ్య మాటామాటా పెరిగి బావమరిది బింగి నరేందర్‌పై బావ జొన్నాడ జంగయ్య చాకుతో దాడిచేసి గాయపరిచాడు. దీంతో బాదితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరళించారు. బాదితుడు నరేందర్ పిర్యాదు మేరకు చెన్‌గోముల్ పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సిఎంను కలిసిన ఎమ్మెల్యే యాదయ్య



**షాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** విదేశీ పర్యటన ముగిరుకుని రాష్ట్రానికి విచ్చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి డి. శ్రీధర్‌ను ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారుడు వేణుగోపాల్‌రావు, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాష్‌గౌడ్‌లతో కలిసి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య శుభాకాంక్షలు తెలియజేశారు.

## తిరంగా యాత్రలో అందరు పాల్గొనాలి

**దోమ, ఆగస్టు 14 ప్రభాతవార్త.** తిరంగా యాత్రలో అందరు బాగస్వాములు కావాలని మాజీ సైనిక ఉద్యోగి గురునాథ్‌రెడ్డి తెలిపారు. బుదవారం నాడు దోమ మండల కేంద్రంలో ప్రదాన రోడ్డు మీదుగా తిరంగా యాత్రా జరిపారు. ఈ సందర్భముగ ఆయన మాట్లాడుతూ దేశ విభజనలో ఎందరో దేశభక్తుల ప్రాణాల త్యాగాన్ని బలి తీసుకున్నటువంటి స్మారక దినంగా ఈ రోజు అని గుర్తు చేశారు. భారతదేశ విభజన ఘోరమైన ఊచకోతలతో కూడిన ఒక విషాదగాద అని దేశవిభజన సందర్భంగా అసువులు బాసిన దేశ అమరవీరులను స్మరించు కుంటూ వారికి సంఘీభావంగా భారి తిరంగా ర్యాలీ కార్యక్ర మం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో మాజి సైనిక ఉద్యోగులు అనంతయ్య, మహేష్, బందయ్య, శ్రీకాంత్, కృష్ణ, శివ, వివిద పార్టీల నాయకులు, అన్ని కులసం ఘాల నాయకులు, యువకులు విద్యార్థులు పాల్గొన్నారు.



# పంద్రాగస్టు వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

## ముఖ్య అతిథిగా సిఎం ముఖ్య సలహాదారుడు వేమ్ నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను రంగారెడ్డి జిల్లా సమీకృత సముదాయం ఆవరణలో ఘనంగా నిర్వహించడానికి జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాదారుడు, ప్రజా వ్యవహారాలు చూసుకునే వేము నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని జిల్లా కలెక్టర్ శశాంక ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయి ప్రభుత్వ అధికారులతో పాటు ఆయా డివిజన్ల వారీగా ఆయా శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు ప్రత్యేక ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## మేడ్చల్ కలెక్టరేట్ వద్ద...

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 14, ప్రభాతవార్త** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగ నిర్వహించటానికి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల జారీ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. గురువారం ఉదయం 9గంటలకు కలెక్టరేట్ ప్రాంగణంలో ఎమ్మెల్సీ పి.మహేంర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవవందనాన్ని స్వీకరించనున్నారు. దీనికి సంబంధించి మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్దం చేస్తున్నారు. జాతీయ పతాక ఆవిష్కరణ తరువాత పోలీసుల గౌరవవందన స్వీకారం, ఎమ్మెల్సీ పి. మహేందర్‌రెడ్డి సందేశం, స్వాతంత్ర్యసరమయోధులకు సత్కారాలు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ అధికారులకు, సిబ్బందికి ప్రశం సపత్రాలు, స్టాల్స్ సందర్శన, ఆ తరువాత వందనసమర్పణతో కార్యక్రమం ముగియనుంది. కలెక్టరేట్‌ను స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ముస్తాబు చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల వద్ద, విద్యాసంస్థల వద్ద జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండలాల్లో, మున్సిపాల్టీల్లో, గ్రామ పంచాయతీల వద్ద జాతీయ పతకాలను పలువురు ఆవిష్కరించనున్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయండి

### ఇంటింటి సర్వే నిర్వహించి కేసులు గుర్తించాలి : కలెక్టర్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు రాకుండా ఇంటింటి సర్వే నిర్వహించి కేసులు గుర్తించాలని జిల్లా కలెక్టర్ శశాంక వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం శివరాంపల్లిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను జిల్లా కలెక్టర్ శశాంక ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఇంటింటి సర్వే నిర్వహించి కేసులు గుర్తించాలని, డాక్టర్లు అప్రమత్తత పాటించి సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్యం, మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ రూమును, ఫార్మసీ స్టోర్‌ను, డాక్టర్ల గదితో పాటు రోగులకు పరీక్షలు చేసే గదిని పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి ఏయే కాలనీల నుండి వైద్యం కొరకుక వస్తారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వచ్చిన వారికి సరైన వైద్యం అందించాల ని డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టెస్టులు నిర్వహించి సంబంధి త వివరాలు



ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శశాంక

రిజిస్టరులో నమోదు చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశం చారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బంధీ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, తహసీల్దార్ రాములు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట

## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంబిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

**కొడంగల్, అగష్టు 14ప్రభాతవార్త** గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీత వేసిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం కొడంగల్ మండలంలోని చిట్లపల్లి గ్రామపంచాయతీ భవనం, టేకుల్‌కోడ్, హుస్సే న్‌పూర్ గ్రామపంచాయతీల భవనాలను సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డితో కలిసి ప్రారంబోత్సవం చేశారు. ప్రారంబోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించి రూ.20లక్షల అంచనా వ్యయంతో గ్రామపంచాయతీ భవనాలు నిర్మాణం చేసిన ప్రారంబించుకున్నామని అన్నారు. గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాలు గ్రామాలకు పట్టకొమ్మలని గ్రామ ప్రజలకు ఏ సమస్య ఎదురైనా గ్రామపంచాయతీ భవనాల్లో పరిష్కరించుకోవచ్చని, గ్రామ ప్రజలందరూ గ్రామపంచాయతీ భవనాలను సద్వినియోగ పరుచుకోవాలని కలెక్టర్ కోరారు. అనంతరం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని బాలాజీనగర్‌లో మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మానం కోసం ఎస్‌డి.ఎఫ్ నిధుల నుంచి రూ.70లక్షల అంచనా వ్యయంతో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మరమ్మత్తు పనులను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలను అందంగా ఆకకర్శణీయంగా తీర్చిదిద్దాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార ్యక్రమంలో కడా అధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్, ఎంపీడీఓ ఉషశ్రీ, అంజేయులు, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు మురళీధర్, సంభందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో మాజీ ఎమ్మెల్యే తనిఖీలు

**మహేశ్వరం, ఆగస్టు 10, ప్రభాతవార్త :** మహేశ్వరం పట్టణ కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి పనితీరును మాజీ శాసనసభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు బుధవారం రోజు ఆసుపత్రి పనితీరును పరిశీలించారు. మహేశ్వరరం హెల్త్ కమ్యూనిటీ సెంటర్‌లో ఎంతమంది డాక్టర్లు పనిచేస్తున్నారు, ఆసుపత్రిలో కల్పించే కనీస సదుపాయాలైన త్రాగునీరు, కొత్తగా నిర్మించిన భవనంతో పాటు స్థానికంగా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులతో ల్యాబ్ టెక్నీషియన్, ఇతర వైద్య సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయన్న విషయాన్ని స్థానికంగా అందుబాటులో ఉన్న డాక్టర్‌ను కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా మహేశ్వరం ప్రాంతంలో పెద్ద ఆసుపత్రి అయిన ఇక్కడ సామాన్య ప్రజలకు వైద్య సేవలు ఎలా అందుతున్నాయనే విషయాన్ని విధులు నిర్వహిస్తున్న డాక్టర్లతో పాటు సామాన్య ప్రజలను, స్థానిక ఉన్న ప్రజా ప్రతినిధులను, కాంగ్రెస్ నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సతో పాటు ఇతర శస్త్ర చికిత్సలు ఎంతమందికి చేస్తున్నారని ఆసుపత్రిలో విధుల్లో ఉన్న సిద్దిఖ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో నెలకొన్న కనీస వసతులతో పాటు ఇతర సదుపాయాలను ఏర్పాటు చేయడానికి తాను స్వతహాగా కెఎల్ఆర్, లీడ్ ఇండియా ట్రస్టుల ద్వారా సత్వరమే నిధులు కేటాయిస్తామని, వెనువెంటనే ఆసుపత్రిలో కనీస వసతుల ఏర్పాట్లు పూర్తి చేయడానికి స్థానికంగా మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు కె. రఘుమారెడ్డికి బాధ్యతలను అప్పగించారు. ఈ ఆసుపత్రి పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించి, పేద ప్రజలకు ప్రభుత్వపరంగా సకాలంలో వైద్యసేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన స్థానిక నాయకులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆసుపత్రుల నిర్వహణకు భారీగా నిధులు కేటాయిస్తుందని, ఈ విషయాన్ని ప్రభుత్వ



రోగులతో మాట్లాడుతున్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

వైద్యాధికారులతో పాటు ప్రజాప్రతినిధులు గమనించి ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించి, ప్రజలకు వైద్యసేవలు అందించాలని ఆయన కోరారు. ప్రతి వారానికి ఒకసారి ఆసుపత్రి పనితీరును పరిశీలిస్తానని, డాక్టర్లు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి సత్ఫలితాలు వచ్చే విధంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, వి. మల్లేష్ యాదవ్, కూన యాదయ్య, ఎ.ఇజ్రాయల్, ఎం.మురళీధర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, అంద్య నాయక్, విఠల్ నాయక్, రాజు నాయక్, కృష్ణ నాయక్, పాండు నాయక్, మహేందర్ రెడ్డి, డి. శ్రీనివాస్‌రెడ్డి, బి.లాజర్, జంగయ్య, కుమార్, రాములు, పరమేష్, అల్లె బిక్షపతి, గుర్రం బిక్షపతి, రాకేష్, యాదగిరి, ఎస్.చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతీ, యువకులకు

# ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ : కలెక్టర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 14, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా షెడ్యూల్డ్‌కులాల సేవా సహకార సంఘం లి.నుంచి నిరుద్యోగ షెడ్యూల్డ్‌కులాల యువతీ, యువకులకు, ట్రాన్స్‌జెండర్స్‌కు ఆర్టీసి హకీంపేట్ ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇవ్వటం జరుగుతుందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లాకు చెందిన నిరుద్యోగ షెడ్యూల్డ్‌కులాల నిరుద్యోగ యువతీ, యువకులకు, ట్రాన్స్‌జెండర్స్‌కు లైట్‌మోటర్ వెహికిల్, హెవీ మోటర్ వెహికిల్ కోర్సుల లో శిక్షణ ఇవ్వటం జరుగుతుందని దీనికి ధరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నా రు. శిక్షణా కాలం 38రోజులు (304)గంటలు అని, ఎల్ఎంవి, హెచ్ఎంవి కోర్సుల శిక్షణ పూర్తి పిదప రవాణాశాఖలో అర్హులకు పర్మినెంట్ లైసెన్స్ ఉచితంగ అందజేయబడుతుందన్నారు. శిక్షణలో బోజనం, వసతి, సదుపాయాలు ఉంటాయని, ఉచిత శిక్షణ డ్రైవర్ల ట్రైనింగ్ ఇన్స్‌స్యూట్ టిఎ, జెడ్ఎస్‌టిసిహకీంపేట్‌లో శిక్షణ ఇప్పించటం జరుగుతుందని కలెక్టర్ గౌతమ్ వివరించారు. లైట్‌మోటర్ వెహికిల్ లైసెన్స్ పొందటానికి 18నుంచి 35ఏళ్లలోపు వారు అర్హులని, కనీసం 8వతరగతి ఉత్తీర్ణత కల్గి ఉండాలన్నారు. లర్నింగ్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ ఎల్ఎల్ఆర్‌తో పాటు కులం, సంవత్సరం లోపు ఆదాయం, ఆధార్ కార్డు, విద్యార్హతల సర్టిఫికెట్లు, 3పాస్‌ఫోర్ట్‌సైజు ఫోటోలు జతపర్చాలన్నారు. హెవీమోటర్ వెహికిల్ లైసెన్స్ కొరకు 20నుంచి 35ఏళ్లలోపు వారు అర్హులని, పదవతరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. లైట్‌మోటర్ వెహికిల్ లైసెన్స్ పొంది ఒక సంవత్సరం అయి ఉండాలన్నారు. బ్యాడ్జి సెంటర్, లర్నింగ్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ ఎల్ఎల్ఆర్‌తో పాటు కులం, ఆదాయం, ఆదార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు 3పాస్‌పోర్టుసైజ్ ఫోటోలు జతరపర్చాలన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 20వ తేదీలోపు కార్యాలయ సమయంలో మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని షెడ్యూల్డ్‌కులాల కార్యాలయంలో ధరఖాస్తులను అందజేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. నిరుద్యోగులు, ట్రాన్స్‌జెండర్స్ కూడ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## వసతి గృహాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు

### అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ శశాంక

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** వసతి గృహాలలో మౌళిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులతో వసతి గృహాలలో మౌళిక సదుపాయాల కల్పనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వసతిగృహాలలో మౌళిక సదుపాయాలకు ప్రత్యేకాధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రతివారం వారికి కేటాయించిన వసతిగృహాలలో తనిఖీ నిర్వహించి, త్రాగునీటి వసతి, విద్యార్థులకు అందుతున్న ఆహారం, మరుగుదొడ్ల సదుపాయానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కాచిన నీటిన విద్యార్థులకు అందించాలని, విద్యార్థినీ, విద్యార్థులకు సీజనల్ వ్యాధులు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తరచూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వసతిగృహాలలో ఉండి చదువుకుంటున్న విద్యార్థినీ, విద్యార్థులకు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. వసతిగృహాలలో మరమ్మతులు చేయించాల్సిన కిటికీలు, డోర్లు, విద్యుత్ సరఫరా వంటి వాటికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వెంటనే చర్యలు చేపట్టాలని, సమస్యలు ఉన్నట్లయితే పంచాయతీ సెక్రెటరీలు, లోకల్ బాడీస్ వారి సహకారంతో చేయించాలని తెలిపారు. వసతి గృహాల వార్డెన్లతో ప్రతివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమస్యల గురించి ఆరా తీసి పరిష్కరించేలా చర్యలు చేపట్టేవిధంగా చూడాలని సూచించారు. వసతిగృహాలలో క్రమం తప్పకుండా పారిశుధ్యం చేపట్టాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా సంక్షేమ శాఖల అధికారులు రఘురావ్, రామేశ్వరి దేవి, నవీన్‌కుమార్ రెడ్డి, సీపీఓ సౌమ్య, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హర్‌ఘర్ తిరంగా...

### ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసిన బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి

**షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 14, (ప్రభాతవార్త) :** హర్ ఘర్ తిరంగాలో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా పిలుపు మేరకు బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం పట్టణంలోని ఆయన ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు తమ తమ ఇంటిపై జాతీయ జెండాలను ఎగరవేయాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు సహితం తమ ఇండ్లపై జాతీయ జెండాలను ఎగరవేసి దేశభక్తిని చాటుకోవాలని ఆయన కోరారు.

### మేడ్చల్‌లో బిజెపి నాయకుల ఆధ్వర్యంలో..



**మేడ్చల్, ఆగస్టు 14. ప్రభాతవార్త :** ప్రధాన మంత్రి నరేంద్రమోది పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మేడ్చల్‌లో బిజెవైఎం ఆధ్వర్యంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ హనుమాన్ దేవాలయం నుండి వివిద కాలనీలో ర్యాలీను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మున్సిపల్ అధ్యక్షుడు అంజనేయులు, జిల్లా నాయకులు జగన్ గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, బిజెవైఎం మున్సిపల్ అధ్యక్షుడు వంశీ విజయ్, నాయకులు అర్జున్, లక్ష్మణ్, సౌమిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నవ తెలంగాణను పరిచయం చేశాం

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా, దక్షిణ కొరియా పర్యటన ద్వారా నవ తెలంగాణను పరిచ యం చేయబోతున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నా రు. బుధవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అమెరికా నుండి తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి షాద్‌నగర్ నియోజకవర్గం తరుపున స్వాగతం పలికారు. నియోజకవర్గం నుండి పలువురు నేతలతో కలిసి శంషాబాద్ వెళ్ళి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ ప్రభుత్వ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ద్వారా ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా పేర్కొంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా రూ.31 వేల 532 కోట్ల రూపాయల పెట్టుబడులతో పాటు 30 వేల 750 ఉద్యోగ కల్పనకు సంబంధించిన ఒప్పందాలను పూర్తి చేసుకొని రాష్ట్రానికి గొప్ప అవకాశం తీసుకురావడం అభినందనీ యమని కొనియాడారు. తెలంగాణను కొత్తగా పరిచయం చేస్తూ చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని సృష్టించబోతున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను 4.0 సిటీగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టులకు విశేష స్పందన లభించిందని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్, ఎలక్ట్రిక్ వెహి కిల్స్, డేటా సైన్సెన్స్, డేటా సెంటర్లు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాలలో ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి అనేక కంపెనీలు ఆసక్తి కనబర్చుతూ ముందుకు వచ్చాయన్నారు. ఎమ్మెల్యే వెంట నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి తదితరులు ఉన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్



డ్రగ్స్ నివారణ పోస్టర్ విడుదల చేస్తున్న పోలీసులు

## విద్యార్థులు ర్యాగింగ్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

-సైబర్‌నేరాలపై అవగాహన..పోస్టర్ విడుదల

**ఘట్‌కేసర్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి శ్రద్దగా చదువుకుంటే ఉత్తములుగా ఎదుగుతారని టిజీఎన్ఏబీ ఏసీపీ బి.రమేశ్ అన్నారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లోని మెఘా మహిళా ఇంజనీరింగ్, ఎన్ఎఫ్‌సీనగర్‌లోని మథర్‌థెరిస్సా ఫార్మసీ కళాశాలలలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఎన్ఏబీ), రాచకొండ పోర పోలీసులు సంయుక్తంగా విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, యాంటీడ్రగ్స్, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. టీజీఎన్ఏబీ ఏసీపీ బి.రమేశ్, మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణితో పాటు పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొని ఆయా అంశాలపై విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ తీసుకున్నా, ర్యాంగింగ్‌కు పాల్పడినా కఠిన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామని వారు తెలిపారు. జూనియర్, సీనియర్ విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉండాలని, ర్యాగింగ్ చేస్తే తగిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

## రోప్‌స్కిప్పింగ్ చాంపియన్‌షిప్ పోటీలు





బహుమతులు అందుకున్న విద్యార్థులు

**ఘట్‌కేసర్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడలోని రోటర్‌డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 3వ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్ పోటీలు రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించారు. రోటర్‌డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్ దేవేంద్ర విద్యాలయ, మెరిడియన్ పాఠశాల, ఉప్పల్ కేంద్రీయ విద్యాలయ, ఖమ్మం కేవీ, బోయినపల్లి కేవీల నుంచి దాదాపు 250 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోప్‌స్కిప్పింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జక్కా వెంకట్‌రెడ్డి, స్పోర్ట్స్ సెల్ ఇంచార్జ ఎస్.సూర్యప్రకాష్, రోప్‌స్కిప్పింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శేఖర్‌రాజు, ఉప్పల్ కేవీ పీఈటి ఎం.కరుణాకర్‌రెడ్డి, న్యాయవాది బాలరాజు, రోటర్‌డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరక్టర్ శ్వేతారెడ్డి, ప్రిన్సిపాల్ కె.రూపారెడ్డిలు విచ్చేసి కార్య క్రమాన్ని ప్రారంభించారు. రోటర్‌డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈపోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ రూపారెడ్డి తెలిపారు. క్రీడలతో విద్యార్థులు శారీరక, మానసిక ఆరోగ్యం పొంది చదువులో తమకు నచ్చిన ఇతర అంశాలలో చురకుగా పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. పోటీల్లో దేవేంద్ర విద్యాలయ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి జక్కా వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా చాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకున్నారు. రోటర్‌డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ద్వితీయస్థానంలో నిలిచారు. తృతీయ స్థానంలో ఉప్పల్ కేవీ, మెరిడియన్ పాఠశాల విద్యార్థులు నిలిచారు. ఈపోటీల్లో వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కూడా బహుమతి ప్రధానం చేసి మెడల్స్‌ను అందజేశారు.

## పాఠ్యేతర అంశాలపై కూడా ఆసక్తి కనబరచాలి

**ఘట్‌కేసర్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** విద్యార్థులకు అవసరమైన సదుపాయలను కల్పించి అభ్యాసంలో ప్రోత్స హిస్తున్నామని ఏయూ ఉపకులపతి డాక్టర్ అర్చన మంత్రి అన్నారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో బీబీఏ విద్యార్థులకు ఒరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. వీసీ అర్చన మాట్లాడుతూ విద్యార్థులకు నేర్చుకోవడం, ప్రయోగాలు చేయడానికి ప్రోత్సహిస్తామని పాఠ్యేతర, సహ పాఠ్య కార్యకలాపాలపు కొనసాగించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఈసందర్భంగా పలు విషయాలపై విభాగాల వారిగా డీన్లు, విభాగాధిపతులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏయూలో 4 సంవత్సరాల బీబీఏ కోర్సు జాతీయస్థాయికి ఎలా అనుగుణంగా ఉందో వివరించారు. ఈకార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ డాక్టర్ బాలాజీ ఉట్ల, ఆడ్మిషన్స్ డైరక్టర్ డాక్టర్ మహిపతి శ్రీనివాస్‌రావు, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ విష్ణువందన, బీబీఏ సలహాదారు ప్రొఫెసర్ పీఎస్ఎస్ మూర్తి, ప్రోగ్రామ్ డైరక్టర్ శివప్రియ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని హరేరామ హరేకృష్ణ సంస్థకు అప్పగించే యత్నాలను ఉపసంహరించుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న సబిత, మధ్యాహ్నభోజన కార్మికులు

**ఘట్‌కేసర్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** మధ్యాహ్నభోజన నిర్వహణను హరేరామ హరేకృష్ణ సంస్థకు అప్పగించే యత్నాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు మండల కార్యదర్శి ఎన్.సబిత డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ విద్యావనరుల కేంద్రం ముందు మిడ్‌డే మీల్స్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయు నాయకులు, పాఠశాల మధ్యాహ్నభోజన కార్మికులతో కలిసి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి ఎంఆర్‌సీ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్న భోజనాన్ని హరేరామ హరేకృష్ణ సంస్థకు అప్పగించాలని నిర్ణయించడం తగదని, ప్రభుత్వ పాఠశాలల్లో గత 24 ఏళ్లుగా కార్మికులు విద్యార్థులకు బోజనం వండి అందిస్తున్నారని చాలిచాలనీ వేతనాలతో తమ కుటుంబాలను నెట్టుకువస్తున్నారని తెలిపారు. గత కొంత కాలంగా బిల్లులు పెండింగ్‌లో బిల్లులను విడుదల చేయాలని సబిత డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కార్మికులకు నెలకు వేతనం పదివేయిలు చొప్పున ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని నెరవేర్చాలని కోరారు. ఈకార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి జి.నాగమణి, తెలంగాణ మధ్యాహ్నభోజన పథకం వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.పుష్ప, ఆర్.శ్రీనివాస్, మండల నాయకులు ఎం.పద్మ, మహేశ్వరీ, రేష్మ, జ్యోతి సువర్ణ, యాదమ్మ, అనసూయ, సుమలత, కళ్యాణి, పద్మ, అమృత, స్వరూప, ప్రేమలత, సునీత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండా ఆకృతిలో మెరిడియన్ విద్యార్థులు

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మెరీడియన్ పాఠశాల విద్యార్థులు జాతీయ జెండా ఆకృతిలో కూర్చుని దేశభక్తిని చాటారు. జాతీయ జెండాలోని మూడు రంగులకు అనుగుణంగా రంగు రంగు టోపిలను ధరించి విద్యార్థులు దేశభక్తి గేయానికి అనుగుణంగా చప్పట్లతో తోటి విద్యార్థులను ఆకర్షించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు దేవేందర్‌రెడ్డి, రాజా వెంకటరెడ్డి, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మాన్ని విచ్ఛిన్నం చేస్తున్న కమ్యూనిస్టులు

తెలంగాణ, ఏపి విశ్వహిందూ పరిషత్ క్షేత్ర ప్రముఖ్ బండారు రమేష్

**షాద్‌నగర్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** ప్రపంచంలోని యాభై రెండు మైనార్టీ దేశాలలో ఎక్కడా లేని కమ్యూనిస్టులు కేవలం భారతదేశంలో ఉంటూ, హిందూ ధర్మాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ క్షేత్ర ప్రముఖ్ బంగారు రమేష్ తీవ్రంగా విమర్శించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అమానవీయ ఘటనలపై విశ్వహిందూ పరిషత్ స్పందించింది. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని స్థానిక రైల్వేస్టేషన్ నుండి పట్టణ చౌరస్తా మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా ఆందోళన నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా భారతీయ జనతా పార్టీ, హిందువాహిని, భజరంగ్‌దళ్, ఏబీవీపీ, తదితర విభాగాల నాయకులు, ప్రజలు సైతం స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారు రమేష్, శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, చెట్ల వెంకటేష్ తదితర నేతలు ప్రభుత్వానికి మెమోరండమ్ సమర్పించారు. అనంతరం మీడియాతో రెండు తెలుగు రాష్ట్రాల విశ్వహిందూ పరిషత్ క్షేత్ర ప్రముఖ్ బండారు రమేష్ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని నాశనం చేసేందుకు కొన్ని దేశాలు నిధులను కూడా సమకూర్చుతున్నాయని ఆరోపణలు చేశారు. ముఖ్యంగా కమ్యూనిస్టులు హిందూ ధర్మాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఇందులో భాగంగా కమ్యూనిస్టులు చైనా, రష్యా దేశాలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. మైనార్టీ దేశాలలో ఎఉక్కడ కమ్యూనిజం లేదని, కేవలం భారతదేశంలోనే కమ్యూనిస్టులు ఉంటూ దేశంలో హిందూ వాదాన్ని అణిచివేసే విధంగా కుట్ర పన్నుతున్నారని, వారిని స్వదేశీ దుర్మార్గులుగా బండారు రమేష్ అభివర్ణించారు. ఇంట్లో ఉన్న గడప దాటిన హిందూ ధర్మాన్ని రక్షించుకునే విధంగానే అందరు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. హిందూ ధర్మాన్ని స్వయంగా దక్షించుకోకపోతే ప్రమాదం పొంచి ఉందని బండారు రమేష్ హెచ్చరించారు.

**ఇస్లామిక్ తీవ్రవాదులారా ఖబడ్దార్ - నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**

ప్రపంచంలోని ఇస్లామిక్ తీవ్రవాదులారా ఖబడ్దార్ మీ ఆటలు ఇక చెల్లవు అంటూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి హెచ్చరించారు. బంగ్లాదేశ్ పాకిస్తాన్ దేశాలకు స్వేచ్ఛ జీవితాలను ప్రసాదించిన హిందువులపై కత్తిగట్టిన ఇస్లామిక్ తీవ్రవాదుల చర్యలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందని



ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

అన్నారు. బంగ్లాదేశ్ ఘటనపై ముస్లిం సంస్థలు, ప్రజలు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో 20 శాతం ఉన్న ముస్లిలు ఈ దారుణాలను కూడా ఖండించాలని సూచించారు. తాము హిందూ ధర్మాన్ని అనుసరిస్తూ, ఇతర మతాలను ఎంతో గౌరవిస్తామని, మరి తమలాంటి వారిపై విదేశాల్లో ఎకందుకు దాడులు జరుగుతున్నాయని శ్రీవర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. బంగ్లాదేశ్ ఘటనలపై ప్రపంచవ్యాప్తంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

**దుర్మార్గమైన చర్య - అందె బాబయ్య**

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు దుర్మార్గమైన చర్యలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెబాబయ్య విమర్శించారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా జరుగుతున్న బంగ్లాదేశ్‌లో దాడులపర్వంపై హిందూ లోకం ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. కనీసం పాపభీతి కూడా లేకుండా మహిళలపై, చిన్నపిల్లలపై దుర్మార్గంగా తెగబడుతున్న దారుణాలు చూస్తుంటే ఎంతో బాధ కలుగుతుందని అన్నారు. ఇలాంటి దాడులను అడ్డుకోకపోతే దేశంలో కూడా ఇలాంటి పరిస్థితులు వచ్చే అవకాశాలు ఉంటాయని అందరు ముక్తకంఠంతో ఇలాంటి దాడులను ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చెట్ల వెంకటేష్, మల్చలం మురళీ, వంశీ, భూషణ్, మఠం రిషికేష్, పుట్నాల సాయి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల మెస్ చార్జీలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు

మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 14,ప్రభాతవార్త :** పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు జరుపుతుందని త్వరలోనే విద్యార్థులకు శుభవార్త చెబుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గురుకుల హాస్టల్లలో సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతి జిల్లాలో కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, విద్యాశాఖ అధికారులు గురుకుల హాస్టల్లను బాధ్యతగా సందర్శించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని అదేశించమన్నారు. గురుకులాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు స్థానిక నిధులతో ప్లాంటేషన్ పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. విద్యారంగ సమస్యలకు రూ.5 వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. యువరైతులకు వ్యవసాయ అధారిత పథకాలకు అవసరమైన రుణాలు ఇప్పించేందుకు తాను, తన యంత్రాంగం ప్రత్యేక శ్రద్ద తీసుకుంటుందన్నారు.

## హర్‌ఘర్ తిరంగాకు జాతీయ జండాల పంపిణీ

-ఎస్‌పికి జండాలు అందచేసిన కలెక్టర్

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** హర్‌ఘర్ తిరంగ సంద ర్భాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి జిల్లా ఎస్‌పి సిహెచ్ రూపేష్ చెన్నూరికి బుధవారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి జాతీయ జండాలను, తెలంగాణ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ పివిఎస్ రెడ్డి పంపిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలకు సంబంధించిన ఉత్తరాలను అందచేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి హెడ్ పోస్ట్ ఆఫీస్ పోస్టుమాస్టర్ పరమేశ్వర్, డిప్యూటీ పోస్ట్ మాస్టర్ శ్రీనివాస్ గౌడ్, ఎస్‌బిసిఓ ఇంచార్జి రమావత్ సురేష్, తపాలా సిబ్బంది కామేష్, రామకృష్ణ, భాస్కర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు14 ప్రభాతవార్త:** మెదక్ జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. మైదానాన్ని పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. జెండా ఏర్పాట్లు, మైదానం సిద్ధం చేయడం మొదలగు ఏర్పాట్లను పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయం తో పూర్తి చేయాలన్నారు. శకటాలు తిరిగే ప్రదేశమును ఏర్పాటు చేసే స్థలాలను చూశారు. వేదిక, సభకు హాజరయ్యే వారు కూర్చోవడానికి సిట్టింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తిచేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. వేడుకలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా చూడాలన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ అధికారులు చూసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎన్సాన్‌పల్లి గురుకుల పాఠశాలను సందర్శించిన సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** సిద్దిపేట అర్బన్ మండ లం ఎన్సాన్‌పల్లి గ్రామంలోగల తెలంగాణ రాష్ట్ర సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. గురుకుల పాఠశా లలో వివిధ తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలలో ఎమైన సమస్యలు ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పహరి గోడ లేక కుక్కలు,పందులు వస్తున్నాయని తెలిపారు. సరిపడా మరుగుదొడ్లు లేవని తాగునీటి వసతి కల్పించాలని కలెక్టర్ వివరించారు. సమస్యలను త్వరలోనే పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు వడించడానికి తయారు చేసిన వంటకాలను క్షుణంగా పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తేవాలన్నారు. ఆయన వెంట ప్రిన్సిపల్ మార్త్, అర్బన్ ఎంపిడిఓ, ఎంపిఓ తదితరులు ఉన్నారు.

## మహనీయుల త్యాగఫలమే స్వాతంత్ర్యం

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** హుస్నాబాద్ పట్టణంలో బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్ ఆధ్వర్యం లో బుధవారం భారీ జాతీయపతాకంతో పట్టణంలో ప్రదర్శన నిర్వహిం చారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాం గోపాల్‌రెడ్డి, జెన్నపురెడ్డి సురేందర్‌రెడ్డిలు పాల్గొని మాట్లాడారు. మహ నీయుల త్యాగఫలమే స్వాతంత్రం అన్నారు. ప్రధాని మోడీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. జాతీయ జెండా ప్రదర్శన ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రారంభమై అంబే ద్కర్ చౌరస్తాలో జనగణమనతో ముగిసింది. కార్యక్రమంలో నాయకులు తిరుమల,శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, స్వరూప, శంకర్‌బాబు, వీరాచారి, లక్ష్మణ్, రాజేందర్, తిరుపతి, సాయి, స్వామి పాల్గొన్నారు.

## బాలుర విద్యా సౌదంలో సమస్యలు పరిష్కరించాలి

-యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు నాచారం శేఖర్

**గజ్వేల్, ఆగస్టు 14 (ప్రభాతవార్త):** పట్టణంలోని బాలుర విద్యా సౌదంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని భారత ఐక్యవిద్యార్థి ఫెడరేషన్ గజ్వేల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గజ్వేల్ ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు నాచారం శేఖర్ మాట్లాడుతూ బాలుర విద్యాసౌదంను పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత లేకుండా పోయిందని, నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వేల మంది విద్యార్థులు చదువుకుంటున్న ఆట స్థలం లేకపోవడం వల్ల స్పోర్ట్స్‌లో రాణించలేకపోతున్నారని అన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిమ్మాపురం యాదగిరి, నీరుడి స్వామి తదితరులు ఉన్నారు.

## అభయారణ్యాన్ని సందర్శించిన ఐఎఎస్ అధికారులు

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** మంజీరాబ్యారేజ్ సమీపం లోని మంజీర అభయారణ్యాన్ని రాం సార్ గుర్తింపు కోసం ప్రతిపాదనలు పంపినట్లు స్టేట్ విట్ ల్యాండ్ అథారిటి సభ్యులు కార్యదర్శి ఐఎఎస్ ధికారి ప్రశాంతి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టి సౌభ్యాగత మిషన్ కార్యక్రమంలో భాగంగా మనిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లో నిర్వహించిన 2రోజుల వర్క్‌షాప్‌లో భాగంగా స్టడీ టూర్ మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ గవర్నమెంట్ ఆఫ్‌ఇండియా ఆధ్వర్యంలో ఐఎఎస్ అధికారుల బృందం బ్యారేజ్‌సమీపంలోని మంజీరా అభయారణ్యంను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వర్షాకాలం, శీతాకాలం, వేసవి కాలంలో ఆయా సీజన్లకు అనుగుణంగా వివిధ రకాల వలస పక్షులు మంజీరా నది మధ్యలో ఉన్న 9 దీవులకు వలస వస్తున్నట్లు తెలిపారు. రాంసార్ గుర్తింపు వల్ల మంజీర అభయారణ్యం ప్రపంచ స్థాయి గుర్తింపు అభిస్తుందని, అందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈసందర్భంగా బోటుపై ఐఎఎస్ అధికారుల బృంధం మంజీరా అభయారణ్యంలోని 9 దీవుల సముదాయంలో విస్తరించి ఉన్న వైల్డ్ లైఫ్ ఆంక్షరీని సందర్శించారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను కేంద్ర బృంధం తలికించింది. కార్యక్రమంలో కేంద్ర బృంధం సభ్యులు కీర్తి మానవస్తా, కల్వెరసన్, డాక్టర్ జాన్సే మాత్యు, వికాస్‌చంద్రగుప్త, శ్రీకాంత్, డాక్టర్ మనోజ్, చంద్రం సింగ్, రాంబాబు, సంగారెడ్డి జిల్లా ఫారెస్ట్ అధికారి శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

## దేశ విభజనలో ప్రాణాలు కోల్పోయిన వారిని గుర్తు చేసుకోవాలి

-బిజెపి జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు14 ప్రభాతవార్త:** దేశ విభజనలో ప్రాణాలు కోల్పోయిన వారిని గుర్తు చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం అనేకమంది పోరాటాలుచేస్తూ ప్రాణ త్యాగాలు చేయడం జరిగిందన్నారు. వారి త్యాగాల మూలంగానే ఇప్పుడు స్వతంత్ర భారతంలో మనం జీవిస్తున్నామని, స్వాతంత్ర్యం రాక ముందు ఈ దేశం ఒకటిగాను ఉంటుందని భావిస్తే స్వాతంత్ర్యం వచ్చిన ఒక రోజు ముందే పాకిస్థాన్ భారతదేశం నుండి విడిపోవడం ప్రత్యేక దేశంగా ఏర్పాటయ్యేందుకు అప్పటి నెహ్రూ, గాంధీలు దానికి అంగీకరించారన్నారు. ఈ దేశ విభజనలో ప్రాణాలు కోల్పోయిన వారిని గుర్తు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి పదవి వ్యామోహమే అని, పదవి కోసమే దేశాన్ని, ధర్మాన్ని, సంస్కృతి సంప్రదాయాలు, మనుషులను ఎంతవర కైనా తీసుకువెళ్లే చరిత్ర కాంగ్రెస్ పార్టీదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా ఇన్‌ఛార్జి సంతోష్, వీణ, ఎంఎల్ఎన్. రెడ్డి, శ్రీనివాస్, సతీష్, నాయకులు రాములు, సుభాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

-పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ

**వర్గల్, ఆగస్టు 14 (ప్రభాతవార్త):** ఎస్‌జిటి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పిఆర్‌టియు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ పేర్కొన్నారు. వర్గల్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో మండల మాజీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డితో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వర్గల్ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11, 12 జీవోలు సవరింపజేసి నూతనంగా 5600 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ పోస్టుల మంజూరికి ఎమ్మెల్సీలతో పాటు రాష్ట్ర కమిటీ తీవ్రంగా కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అలాగే పిఎస్ హెచ్ఎంలు పదివేలకు పెంచి డిఎడ్, బిఎడ్ అర్హత కలిగిన అందరికి పదోన్నతులు త్వరలోనే దక్కనున్నట్లు తెలిపారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు ఉండడంతో పాటు ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా పిఆర్‌టియు సంఘం కృషి చేస్తుందని తెలిపారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులు, ఉచిత కరెంటు కూడా పిఆర్‌టియు సంఘం ద్వారానే సాధ్యమైందని పేర్కొన్నారు. 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు త్వరలోనే పాత పెన్షన్ జివో రానుందని, సిపిఎస్ రద్దు కోసం కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వివరించారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాష్‌చందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ప్రశాంత్‌కుమార్, శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

**గజ్వేల్, ఆగస్టు 14 (ప్రభాతవార్త):** దేవాలయ భూములు, ఆస్తులను ఎవరైనా ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు చేపడతామని గజ్వేల్ రామాలయం శివాలయం ఈవో శశిధర్ హెచ్చరించారు. బుధవారం గజ్వేల్ ఐఓసి సమీపంలోగల రామాలయం శివాలయంకు సంబంధించిన ఆరు ఎకరాల రెండు గుంటల భూమిలో దేవాదాయ శాఖ భూములుగా పరిగణిస్తూ బోర్డును ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఈవో శశిధర్ మాట్లాడుతూ 500 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన రామాలయం శివాలయం నిర్వహణ కోసం గతంలో దాతలు భూములు ఇవ్వడం జరిగిందన్నారు.వాటిద్వారా వస్తున్న ఆదాయాన్ని దేవాదాయశాఖ ద్వారా ఆలయ నిర్వహణకు ఖర్చుచేయడం జరుగుతుందన్నారు. భూముల వ్యవహారంలో ఇటీవల పలువురు కోర్టునుఆశ్రయించడం జరిగిందని, దీనిపై దేవాదాయ శాఖ స్పందిస్తూ ఇంప్లీడ్ పిటిషన్ వేయడం జరిగిందని తెలిపారు. దేవాదాయ శాఖ సిబ్బంది నరసింహారెడ్డి, రవీందర్, నాయకులు కళ్యాణ్‌కార్ నర్సింగరావు, మల్లేశం, అమరేందర్‌రావు, రాజు, స్వామి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## బివిఆర్ఐటి, ఐకెపి ప్రైమ్ మధ్య కీలక ఒప్పందం

**నర్సాపూర్ రూరల్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** బీవీఆర్ఐటి, ఐకేపీ ప్రైమ్ మధ్య కీలక ఒప్పందం జరిగింది. హైదరబాద్ 9-08-24 విద్యాపరిశోధనలో కీలక ముందడుగు పడింది. మంగళవారం నాడు బీవీఆర్ఐటి మరియు ఐకేపి ప్రైమ్ మధ్య జరిగి ఈ అవగాహన ఒప్పందం ఆగస్టు 13,2024 సంతకాలు జరిగినట్లు వారు తెలిపారు. ఈ భాగస్వామ్యంతో విద్యార్థులు మరియు ఫ్యాకల్టీ సభ్యుల పరిశోధన, నూతన ఆవిష్కరణలు, మరియు ఉత్సాహవంతమైన వ్యాపార యజమానులను మరింతగా ప్రోత్సహించడానికి అనువైన వాతావరణం సృష్టించబడుతుందన్నారు.కార్యక్రమంలో బీవీఆర్ఐటి నుండి డా. సంజయ్ దుబే, డా,, సుజనా, అలాగే రోహిత్ సిర్సా పాల్గొన్నారు.



ర్యాగింగుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ వెంకటయ్య

## ర్యాగింగుకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

**కీసర,ఆగస్టు14,ప్రభాతవార్తః** విద్యార్థులు ర్యాగింగుకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కీసర సిఐ వెంకటయ్య తెలిపారు.బుధవారం మండలంలోని చీర్యల గ్రామంలోని గీతాంజలి కళాశాలలో విద్యార్థులు ర్యాగింగుపై అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ వెంకటయ్య మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగుకు పాల్పడి తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు.కళాశాలలో తమ తోటి విద్యార్థులను ఎవరైనా ర్యాగింగు చేస్తే వారి పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతందని తెలిపారు.ర్యాగింగుకు పాల్పడితే 100 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.ర్యాగింగు చేసి జైలుకు వెళ్లి విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కీసరగుట్టలో శైలజా రామయ్యర్



కీసరగుట్టలో ప్రత్యేక పూజలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ శైలజా రామయ్యర్

**కీసర,ఆగస్టు14, ప్రభాతవార్తః** కీసరగుట్ట ఆలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు.బుధవారం కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయం లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి,జరుగబోయే అభివృద్ధి గురించి చర్చించడం జరిగింది. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్ర మంలో ఆలయ ఈఓ కట్టా సుధాకర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ,ఫౌండర్ ట్రస్టీలు తటాకం నారాయణశర్మ,ఆలయ అర్చకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు బహుమతులు అందజేసిన దృశ్యం

**మేడ్చల్, ఆగస్టు 14. ప్రభాతవార్త ః** మేడ్చల్ మండలంలోని లింగాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం సుచిత్ర లయోలా అకాడమీ బిఎస్సీ విద్యార్థులు పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిద పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు హై జెనిక్ ఫుడ్, స్కూల్ బ్యాగులను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మీ సంజీవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమేష్ రెడ్డి, పాఠశాల చైర్మన్ కవిత, లయోలా అకాడమీ ప్రిన్సిపల్ జోజిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్ అవేర్నెస్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వరప్రసాద్

**కడ్తాల్,ఆగస్టు 14 ప్రభాతవార్త :** 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కడ్తాల్ మండల కేంద్రంలో ఉన్న కెజిబివి బాలికల పాఠశాలలో బుధవారం ఎస్సై శివప్రసాద్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ అవేర్నెస్‌పై పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో మొదటి, రెండవ, మూడవ బహుమతులను రేపు ఉదయం కడ్తాల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ శివప్రసాద్ చేతుల మీదుగా అందజేయడం జరుగుతుంది. అలాగే సైబర్ క్రైమ్‌పైన సమాజంలో జరిగే నేరాలపై, ఉన్నత చదువులపై వారికి అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష పదివేల రూపాయల జరిమానా

**కేశంపేట,ఆగస్టు 14 ప్రభాతవార్త** ఐదు సంవత్సరాల క్రితం నాయనమ్మను హత్య చేసిన నిందితుడికి బుధవారం 10 సంవత్సరాల జైలు శిక్ష మరియు పదివేల రూపాయల జరిమానా విధించారు. వివరాల ప్రకారం నిందితుడు కుమ్మరి శేఖర్ తండ్రి సాయిలు (27) గ్రామం కాకునూరు ఏపని పాట లేకుండా జులాయిగా తిరిగేవాడు ఈ క్రమంలో తేదీ 12.12.2019 రాత్రి పది గంటల సమయంలో మద్యం తాగడానికి డబ్బుల గురించి అతని నాయనమ్మ అయిన కుమ్మరి లక్ష్మమ్మ దగ్గర ఉన్న పింఛన్ డబ్బులు ఇవ్వమని అడుగగా ఇవ్వనందున కుమ్మరి లక్ష్మమ్మ యొక్క తలను నేలకు బాది కట్టేతో తలపై కొట్టగా లక్ష్మమ్మ మృతి చెందింది. అట్టి కేసును 13.12.2019 రోజున కుమ్మరి యాదగిరి తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని అప్పటి సిఐ రామకృష్ణ దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేయనైనది అట్టి కేసును శిరీష 9వ అదనపు జిల్లా జడ్జి రంగారెడ్డి సాక్షులను విచారించి సాక్షుల భయానాలు పూర్తయిన తర్వాత వాదోపవాదాలు విన్నతరువాత నేరం రుజువైనందున నిందితుడు శేఖర్‌కు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు పదివేల రూపాయల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించనైనది. ఇటి కేసులో పబ్లిక్ ప్రాసికుటర్‌గా రఘు నిర్వహించారని కేశంపేట ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.



## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**తలకొండపల్లి, ఆగస్టు 14, ప్రభాతవార్త** తలకొండపల్లి మండలంలోని చీపునుంతల గ్రామానికి చెందిన దర్జీ వీరప్ప తండ్రి చెంద్రప్ప అనారోగ్యంతో బుధవారం మరణించడం జరిగింది. ఇటి విష యాన్ని బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎర్ర నరోత్తమ్‌రెడ్డి ద్వారా తెలుసుకున్న కల్వకుర్తి తాలూకా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తలకొండపల్లి మాజీ ఎంపిపి సిఎల్ శ్రీనివాస్ యాదవ్ ఆ కుటుంబానికి 3000 వేల ఆర్థిక సాయం చేయడం జరిగింది. అదేవిధంగా చీపునుంతల బిఆర్ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో 3000 మూడువేల రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది. చీపునుంతల బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆ కుటుంబానికి మొత్తం బిఆర్ఎస్ పార్టీ తరపున 6000 వేల ఆర్థిక సాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మా జీ వైస్ ఎంపిపి ఎర్ర జనార్థన్‌రెడ్డి ఎర్ర నరోత్తమ్ రెడ్డి బత్తుల బాల కుమార్ గౌడ్ మండ్ల గిరిబాబు బత్తుల రమేష్‌గౌడ్ పసునూరి బ్రహ్మాచా రి బత్తుల శేఖర్ గౌడ్ ఉదరి పర్వతాలు యాదవ్ బాదేపల్లి శేఖర్‌గౌడ్ మద్దూరి శ్రీనివాస్ నిలకంటి శేఖర్ మల్తూంకార్ యాదిలాల్ తదితరులు పాల్గొన్నారు.

## చుక్కాపూర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

**తలకొండపల్లి, ఆగస్టు 14, ప్రభాతవార్త** గ్రామంలోని అండర్ డ్రైనేజీ సిసి రోడ్లకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. చిన్నిపాటి వర్షం వస్తే చాలు గత 20 సంవత్సరాలుగా అంతరాయం జరగడం జటిలంగా మారింది. ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలు ప్రస్తుతం శిధిలావస్థకు చేరు కున్నాయి నూతనంగా బిల్లింగు నిర్మాణం కోసం నిధులు కేటాయించాల ని,



గ్రామ వ్యవసాయ రంగానికి అనుసంధానంగా పాడి పశువులు మేకలు గొర్రెలపై ఆధారపడి పశువులు మేకలు గొర్రెల పై ఆధారపడి జీవించే రైతులు ఎక్కువ మొత్తంలో ఉన్నాయి. కాబట్టి వారంలో రెం డు నుంచి మూడు రోజులపాటు పశువైద్య అధికారులను తాత్కాలికంగా నియమించాలని ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా చుక్కాపూర్ నుంచి చెన్నారం బీటి రోడ్డు మొత్తం గుంతలమయంగా మారిందని నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ జక్కు శ్రీనివాస్‌రెడ్డి ఎండి తాహేర్ దేశం సంతోష్‌రెడ్డి వైస్ ఎంపిపి శ్రీనివాస్‌రెడ్డి కోగూరు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బ్రెయిన్ స్ట్రోక్ బాధితుడికి ఆర్థిక సాయం



**తలకొండపల్లి, ఆగస్టు 14, ప్రభాతవార్త** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన మహమ్మద్ షకీల్‌కు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కడ్తాల్ మైనార్టీ సోదరులు తమకు తోచిన విధంగా డబ్బులు సమకూర్చి 15,500 రూపాయలు షకీల్ భార్యకు హాస్పిటల్‌లో అందజేయడం జరిగింది. ప్రతి ఒక్కరూ మానవ దృక్పథంతో ప్రతి ఒక్కరికీ సహాయం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సభ్యులు పాల్గొన్నారు.

## సుల్తాన్‌పల్లి విద్యార్థులకు టై,బెల్టులు పంపిణీ



**శంషాబాద్,ఆగస్టు 14 ప్రభాతవార్త** సుల్తాన్‌పల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కవ్వగూడ సుల్తాన్ పల్లి మాజీ ఎంపిటిసి సంగీత సిద్దేశ్వర్ సుల్తాన్‌పల్లి మాజీ సర్పంచ్ యాటకారి సిద్దేశ్వర్ ముదిరాజ్ టై బెల్టులు పంపిణీ చేశారు. చిన్నారి బాలబాలికలకు ఉచితంగా అందజేయడం వల్ల పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు ఆగిరెడ్డి లక్ష్మయ్య దేవేందర్ మాజీ వార్డు మెంబర్ శ్రీశైలం విక్రమ్ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని మేకలు మృతి



**ధారూర్, ఆగస్టు 14 ప్రభాతవార్త** రైలు ఢీకొని దాదాపు 50 మేకలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ధారూర్ స్టేషన్ రైల్వే క్రాసింగ్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మండల పరిదిలోని డికే తండాకు చెందిన చంద్రిభాయ్ కేతావత్ రమేష్ కిష్టి భాయ్ పుల్‌సింగ్ బాల్‌రాజ్ నాయక్‌కు చెందిన మేకలు సమీపంలోని అడవిలోకి మేతకోసం తీసుకెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి వస్తుకువస్తుండగా మదనంతపూర్ మైసమ్మ బిడ్జి వద్ద అడవి పందులతో బెదిన మేకలు రైల్వే పట్టాలపైకి వచ్చాయి. అదే సమయంలో రైలు రావడంతో దాదాపు 50 మేకలను రైలు ఢీకొట్టింది. విషయం తెలుసుకున్న బాధిత యజమానులు ప్రమాద స్థలానికి చేరుకుని కన్నీరు పెట్టారు. చనిపోయిన మేకల విలువ దాదాపు 3 లక్షల వరకు ఉంటుందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

## నేడు పదిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సన్మానం

**ధారూర్, ఆగస్టు 14 ప్రభాతవార్త** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు గురువారం మెమోంటో శాలువాతో సన్మానిస్తున్నట్లు ధారూర్ మాజీ జెడ్పిటిసి సుజాత వేణుగోపాల్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు ప్రజాప్రతినిధులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి

**కొడంగల్, అగష్టు 14ప్రభాతవార్త** కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తు రాష్ట్రంలోనే కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంబోత్సవాలు చేశారు. కొడంగల్ మండలంలోని పాటుమీదిపల్లిలో, టేకుల్‌కోడ్, హుస్సేన్‌పూర్ గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించారు. అలాగే కొడంగల్ పాఠశాల భవనంకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో తిరుపతిరెడ్డి మాట్లాడుతు కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్ళడం జరుగుతుందన్నారు. ఓ పక్క అభివృద్ధి మరోపక్క సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. కొడంగల్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. విద్య, వైద్య, సాగునీరు. త్రాగునీరు, రోడ్ల అభివృద్ధికి అధికా ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా కొడంగల్ మెడికల్, నర్సింగ్, వెటర్నరీ కళాశాలలతో పాటు కోస్గీలో ఇంజనీరింగ్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, మద్దూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మంజూరీ చేసినట్లు తెలిపారు. అంతేగాక కొడంగల్ నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు గాను కొడంగల్-నారాయణపేట్ ఎత్తిపోథ ల పథకం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే కృష్ణ- వికారాబాద్ రైల్వేలైన్ సర్వేపనులు యుద్ద ప్రాతిపదికన కొనసాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నందారం ప్రశాంత్, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉషారాజేందర్, పీఏసీఎస్ అధ్యక్షులు కట్కం శివకుమార్‌గుప్త, మాజీ జడ్పీటీసీ ఏన్గుల భాస్కర్, కొడంగల్ నయ్యూం, చిట్లపల్లి మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, అనందరెడ్డి, సాయిలు, అంబయ్యగౌడ్, పాండు, ఆసీఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి

## మానవ మనుగడకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

### కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి



విద్యార్థులతో కలసి మొక్కలు నాటుతున్న లీలా లక్ష్మారెడ్డి

**కడ్తాల్, ఆగష్టు 14 ప్రభాతవార్త :** సికింద‌రాబాద్ కస్తూర్బా గాంధీ డిగ్రీ, పిజి కళాశాలలో బుధవారం వనవాటిక (ఎన్విర్నమెంటల్ క్లబ్) ఆధ్వర్యంలో కళాశాల ప్రధాన అధ్యాపకులు డా. రాజశ్రీ, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. వన మహోత్సవం సందర్భంగా విద్యార్థులు పలు ఔషధమొక్కలు కళాశాల ప్రాంగణంలో నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ వ్యాపారవేత్త కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి మొక్కల పరిరక్షణ గురించి ఆవశ్యత విద్యార్థులకు వివరించారు.

## హాస్టల్ విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**షాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** షాబాద్ మండల కేంద్రంలో ఎస్సీ హాస్టల్ ఉన్నటువంటి హాస్టల్ విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్ అన్నారు. బుధవారం సాయంకాలం వేళ ఎస్సీ హాస్టల్ సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులో కలిసి ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ సభ్యత్వం నమోదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... హాస్టల్ విద్యార్థులకు మిస్ కాస్మెటిక్ చార్జీలు పెంచక్కాపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎస్సీ హాస్టల్ అధ్యక్షుడిగా సాయితేజ, కార్యదర్శి చెన్నయ్య, ఉపాధ్యక్షుడు గణేష్, సహాయ కార్యదర్శి కిరణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు సాయిగణేష్, తబ్రేష్, రహమత్‌ఖాన్, ప్రశాంత్, కార్తీక్, శంకర్, లోకేష్, కిరణ్, విద్యార్థులు ఉన్నారు.

## వ్యక్తిగత ప్రయోజనాల కన్నా పార్టీ ప్రయోజనాలే మిన్న : ఎమ్మెల్యే శంకర్



నాయకులు కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు తీరుస్తూ కష్టపడే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం దక్కుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో షాద్‌నగర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించాలంటే ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని, ప్రజల యొక్క సమస్యలను తీరుస్తేనే వారి యొక్క ఆదరాభిమానాలు చూరగొంటామని తెలిపారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలు ముఖ్యమని, పార్టీ శ్రేయస్సు కోసం పాటుపడే ప్రతి కార్యకర్తకు నామినేటెడ్ పదవుల్లో లేదా కౌన్సిలర్‌గా ఏదో ఒక రూపంలో అవకాశం కల్పిస్తామని తెలిపారు. షాద్‌నగర్ టౌన్‌కు సంబంధించి ఒక కమిటీని వేసుకొని ప్రతి వార్డును దర్శించి అక్కడ ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతినెల సమన్వయ సమావేశాలు నిర్వహహిం చుకొని పార్టీ యొక్క బలోపేతం గురించి చర్చించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ కొంకళ్ళ చెన్నయ్య, సీనియర్ నాయకులు అగ్గనూరు విశ్వం, బాబర్ ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, రఘు నాయక్, బస్వం అప్ప, జమృద్‌ఖాన్, సర్వర్ పాష, విజయ్ కుమార్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, అందె మోహన్, యాదగిరి, రాజేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, ఖదీర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**కడ్తాల్, ఆగష్టు 14 ప్రభాతవార్త :** దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా బుధవారం కడ్తాల్ మండల కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులు, ఎస్‌విఎస్ విద్యార్థులు, బిజెపి ఎస్టీ మోర్చా కార్యకర్తలతో కడ్తాల్ ఎస్టీ మోర్చా అధ్యక్షులు నేనావత్ ప్రేమ్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమం కడ్తాల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాల నుంచి సినిమా థియేటర్ వరకు మళ్లీ సినిమా థియేటర్ నుంచి బస్టాండ్ కెనరా బ్యాంక్ వరకు ర్యాలీని విజయవంతంగా నిర్వహించారు. ఎస్టీమోర్చా రాష్ట్ర అధ్యక్షులు డా. కళ్యాణనాయక్, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా ఎస్టీ మోర్చా ఇంఛార్జి కేతావత్ భాస్కర్‌నాయక్, రంగారెడ్డి జిల్లా ఎస్టీమోర్చా అధ్యక్షులు బాణావత్ సాయిలాల్ నాయక్, బిజెవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి కంటేకర్ భగీరథ, మాజీ ఎంపిపి వీరయ్య, జిల్లా రవిందర్‌రెడ్డి, యాదగిరి, మోర్చాల అధ్యక్షులు మాల శ్రీశైలంగౌడ్, శేఖర్, బిజెపి నాయకులు దోనదుల మహేష్, మల్లేష్, రాజు, వినోద్, శ్రీకాంత్, మధు, మల్లేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## తండాల అనుబంధ గ్రామాల్లో మూతపడుతున్న ప్రభుత్వ పాఠశాలలు



మూతపడునున్న బొల్లిగుట్ట తండా ప్రాథమిక పాఠశాల

**యాచారం ఆగస్టు14,ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో మారుమాల తండాలు అనుబంధ గ్రామాలో ఉన్న ప్రాథమిక పాఠశాలలన్ని మూత పడబోతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలందరికి ఉచిత ప్రాథమిక విద్య అందాలని ఆదేశాలు జారీ చేస్తూ ప్రణాలిక చేపడుతుంటే సంబంధిత విద్యాశాఖ మండలాధికారి నిర్లక్ష్య వైఖరితో ఉన్నట్లు తెలుస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. మారుమూల గ్రామంలోని తండాలలో గ్రామ పంచాయతీల అనుబంధాల గ్రామాలలో ఉపాధ్యాయులు ఒకరు ఉండడంతో వారు పనిచేయడానికి అయిష్టతతో ఉన్నారని తెలుస్తుంది. ఒక్కరే ఉపాధ్యాయులు ఉంటే మా పిల్లలకు బోధనలు సరిగా ఉండవని భావించిన ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నాట్లు పలువురు పేర్కొంటున్నారు. గతంలో ఆయా పాఠశాలలో ఇద్దరి టీచర్ ఉండి విద్యార్థులకు మెరుగైన బోధనలు చేపట్టి దాతల సాయంతో ప్రాథమిక అవసరాలను సమకూర్చి వారికి ప్రైవేటు పాఠశాలకు దీటుగా బోధనలు చేపట్టేవారని నేడు వారు బదిలీపై వెళ్లడంతో ఆయా గ్రామాలలోని ఆయా పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు అనాసక్తితో ఉండడంతో మూతపడే పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలలో మౌలిక వసతులు కల్పించడంలో పాఠశాలల అభివృద్ధికి కుంటుపడిపోతుందంటున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో ప్రభుత్వ పాఠశాల పరిస్థితి మరి దిగజారిపోనుందని గుర్తు చేస్తున్నారు. ఇట్టి పరిస్థితులలో సర్పంచ్‌లు ఉండి ఉంటే ప్రభుత్వ పాఠశాల కోసం ప్రత్యేక శ్రద్ధ వహించి మూతపడకుండా చేసేవారిని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. మండల విద్యాధికారి 4 మండలాలకు ఒకరే ఉండడం వలన నేడు గ్రామాలలో ఉన్న మారుమూల ప్రాంతం పాఠశాలల వైపు కన్నెతినత చూడడం లేదని దీంతో రోజుకో పాఠశాల మూతపడే పరిస్థితి ఏర్పడిందని ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు మేల్కొని ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేసి మూతపడకుండా చేయాలని కోరుతున్నారు.

## మానవత్వం చాటుకున్న విఠ్యాల గ్రామస్థులు

### పేదరైతు కుటుంబానికి రూ.53 వేల ఆర్థిక సాయం



లింగం కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్థులు

**షాద్‌నగర్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాల గ్రామానికి చెందిన బోయ లింగానికి చెందిన రెండు పాడి ఆవులు అనారోగ్యం కారణంగా సోమవారము మృతి చెందాయి. రెక్కాడితే గానీ డొక్కాడని లింగం కుటుంబం పడి పరిశ్రమ మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తుంటాడు. దీంతో అనారోగ్యం కారణంగా ఆవులు మృతి చెందడం వల్ల వారి కుటుంబానికి ఆర్థికంగా తీవ్ర లోటు ఏర్పడింది. లింగం దంపతులకు బాసటగా ఆర్థిక సాయం చేసేందుకు స్థానిక నాయకులు నిలిచారు. గ్రామంలోన బోయ లింగంది నిరుపేద కుటుంబం. విషయం తెలుసుకున్న విఠ్యాల గ్రామస్థులు లింగం కుటుంబ సభ్యులకు రూ.53 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. పేద రైతు లింగం కుటుంబ సభ్యులను దాతలు ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో బి. లింగం, పాల నర్సింలు, ఆర్. నాదమయ్య, ఎం.డి. ఇసాక్, శంకర్ నాయక్, చంద్రకాంత్, వెంకటేష్ గౌడ్, ఆర్ నర్సింలు, కె. పాపయ్య, ఆర్.మల్లేష్, ఎం.వెంకటేష్, ఎం. యాదయ్య, జి.నర్సింలు, జవాజీ శంకర్, ఆర్.విష్ణు, మెగ్యా నాయక్, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మర్పల్లిలో బంద్ ప్రశాంతం




నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

**మర్పల్లి అగస్టు 13 ప్రభాతవార్త :** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మిజెపి దాని అనుబంధ సంస్థలు ఇచ్చిన పిలుమేరకు బుధవారం నాడు మండల కేంద్రలో బంద్ ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రంలోని వ్యాపారవేతలు స్వచ్ఛం దంగా వ్యాపార సంస్థలను మూసివేశారు. బంద్‌కు మద్దతు ప్రకటించారు బిజెపి అనుబంధసంస్థలు తాసిల్దార్ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు భారి నిరసనర్యాలీనిర్వహించారు. బంగ్లాదేశ్‌లోహిందువులపై జరుగుతున్న ప్రతి ఒక్క హిందువు ఖండిం చాలని జిల్లా నాయకులు మల్లేవ్‌యాదవ్ అన్నారు ఈసమావేశంలో నాయకులు రాజేందర్‌రెడ్డి, లక్ష్మణ్, మాదవరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, యాదవరెడ్డి శాంతప్పరాజెందర్ పలు అనుబంధ సంస్థలన నాయకులు పాల్గొన్నారు.



తిరుమలమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## అమృతమూర్తికి అశ్రునివాలి

**నందిగామ, ఆగస్టు 14 ప్రభాతవార్త** నందిగామ మండల కేంద్రంలో ఉన్నప్రిన్స్ ప్యాలెస్ ప్లాజాలో వంకాయల తిరుమలమ్మ దశదిన కర్మలో పలువురు బంధుమిత్రులు రాజకీయ ప్రముఖులు ఆయా పార్టీల నాయకులు అధికారులు హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి భీష్మ కిష్టయ్య రావుల చంద్రశేఖర్ రెడ్డి మాజీ ఎంపిపి శివశంకర్‌గౌడ్ మాజీ ఏఎంసి చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి రాంరెడ్డి జగన్మోహన్‌రెడ్డి రామకృష్ణారెడ్డి రేగొండ భీమ్‌రెడ్డి వెంకట్‌రెడ్డి చల్మారెడ్డి రవీందర్‌రెడ్డి వేణుగోపాల్‌రెడ్డి మాజీ సర్పంచ్ రామన్న జిల్లెల్ల వెంకటరెడ్డి తాండ్ర గోపాల్‌రెడ్డి విక్రమ్ శర్మ రేగొండ రాథాకృష్ణారెడ్డి రేగొండ రఘునాథ్‌రెడ్డి రేగొండ రమేష్‌రెడ్డి రమేష్‌రెడ్డి మాదారం యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి విగ్రహాల ప్రతిష్ట పూజాలు

**శామీర్‌పేట, ఆగస్టు 14, ప్రభాతవార్త** శామీర్‌పేట గ్రామంలో శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట పూజా కార్యక్రమాలు ఈ నెల 15వ తేదీ నుంచి 17వరకు మూడు రోజుల పాటు జరుగనున్నాయి. శామీర్‌పేట పెద్ద చెరువుకట్టమైసమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని శ్రీవీరభద్రస్వా మి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట జరుగనున్నట్లు కట్టమైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ వి.అశోక్ తెలిపారు. శ్రీకట్టమైసమ్మ అమ్మవారి ఆశీస్సులతో ఆలయ కమిటీ పాలకవర్గం, గ్రామ నాయకుల, ప్రజలందరి సహకారంతో శ్రీవీరభద్రస్వామి ఆలయాన్ని పున:నిర్మాణం పనులు పూర్తి జరిగినట్లు తెలిపారు. గురువారం, శుక్ర, శనివారం రోజులలో విగ్రహాల ప్రతిష్ట సందర్భంగ ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. ఈ విగ్రహాల ప్రతిష్ట సందర్భంగ పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొననున్నారు. దీనికి సంబంధించి ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు.

## కుసుమపంటపై రైతులకు అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న రైతులు తదితరులు

**పూడూరు, ఆగష్టు 14, ప్రభారవార్త ;** అధిక నూనెశాతం కలిగిన కుసుమ రకాలను ఎంపిక చేసుకొని కుసుమపంటను సాగుచేస్తే మంచిదిగుబడి వచ్చే అవకాశం ఉందని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ తెలిపారు. బుధవారం వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని మిట్టకంకల్ గ్రామంలో రైతులకు కుసుమ పంట సాగుపై అవగహన కలిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నూనె గింజల సాగు ప్రోత్సహించేందుకు భారతీయ నూనె గింజల పరిశోధన స్థానం రాజేంద్రనగర్ హైదరాబాద్ వారి సహకారంతో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అద్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కుసుమ సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, ఎరువులు, తెగుళ్ల నివారణకు కోసం చర్యలపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ నూనె గింజల పరిశోధన స్థానంప్రతినిధి రాథోడ్, రైతులు పిరంగి శ్రీనివాస్ బందయ్య, దశరథ, రాజు, నర్సింలు, అంజయ్య, సత్యయ్య, అర్జున్, శేఖరయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## హస్నాబాద్‌లో శాంతీయుత నిరసన ర్యాలీ

**కొడంగల్, అగష్టు 14ప్రభాతవార్త** హిందు సంఘాల ఐక్యవేదిక అద్వర్యంలో మండల పరిధిలోని హస్నాబాద్‌లో చేపట్టిన శాంతియుత నిరసన ర్యాలీ విజయవంతమైంది. బుధవారం హస్నాబాద్ గ్రామంలో చేపట్టిన నిరసన ర్యాలీలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరైయ్యారు. ఈ సందర్బంగా హింధువాహిని అద్వర్యంలో గ్రామంలో గాంధీకూడలిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సంఘం నాయకులు మాట్లాడుతు బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను వారు తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోవిందరాజు, అనందర్, సూరి, శ్రీకాంత్, చింటు, అకాష్, మారుతి, అంజి, నరేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే శంకర్



మాజీ మంత్రి శంకర్‌రావు కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మాజీ మంత్రి డాక్టర్ పి. శంకర్‌రావును హైదరాబాద్‌లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బుధవారం మర్యాదపూర్వకంగా ఆయనను వారి స్వగృహంలో కలుసుకున్నారు. షాద్‌నగర్ కాంగ్రెస్ రాజకీయాల్లో ఆయనతో సుధీర్ఘకాలం కలిసి పనిచేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డాక్టర్ పి.శంకర్‌రావు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సాధారణ కార్యకర్తగా ఆయన వద్ద పనిచేసిన ఎమ్మెల్యే శంకర్ గత స్మృతులను గుర్తుచేసుకున్నారు. కార్యకర్తలకు అన్నివేళలా అండగా నిలబడిన మాజీ మంత్రి శంకర్‌రావును ఓ గొప్ప నేతగా ఆయన అభివర్ణించారు. శంకర్‌రావుతో తనకు రాజకీయంగా విడదీయలేని అనుబంధం ఉందని, వారి సూచన, సలహాల ప్రకారమే పాటించి, తన జీవితంలో ఎమ్మెల్యేగా ఎదిగినట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి శంకర్‌రావు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. నియోజకవర్గంలో ఐదు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా ఇక్కడ ప్రాతినిథ్యం వహించారని, నియోజకవర్గం అభివృద్ధిపై ఆయన మార్కు స్పష్టంగా ఉందని గుర్తుచేశారు. మాజీ మంత్రి శంకర్ రావును కలిసిన వారిలో స్థానిక నేతలు మహ్మద్ అలీఖాన్ బాబర్, చెంది తిరుపతిరెడ్డి, రఘు నాయక్, సీతారాం, శేఖర్, దర్శన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మోత్కుపల్లి గ్రామంలో తిరంగా జెండా కార్యక్రమం

**కోట్‌పల్లి, ఆగస్టు 14, ప్రభాతవార్త;** రాష్ట్ర బీజెపి పార్టీ పిలుపు మేరకు కోట్‌పల్లి మండల బీజెపి అధ్యక్షులు క్రిష్ణయాదవ్ ఆధ్వర్యంలో ఉదయం పది గంటలకు కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో తిరంగా జెండా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీజెపి మండల ప్రధాన కార్యదర్శి కె. చంద్రయ్య, కె, రాజేందర్‌రెడ్డి, పి, పాండు, కర్ణకర్, తదితరులు పాల్గోన్నారు,

